
సాక్షి చిత్తూరు
సోమవారం । 6 । జనవరి । 2025



**వామ్మో.. చైనా వెల్లుల్లి**
ప్రమాదకరమైన చైనా గార్లిక్‌ను మార్కెట్లలో తక్కువ ధరకు విక్రయిస్తుండడంతో జనం ఎగబడి కొనేస్తున్నారు. - 8లో



**పబ్లిసిటీకి.. ప్రహరీగోడలు**
అధికార పార్టీ నాయకుల పబ్లిసిటీ పిచ్చి గోడలపైకెక్కడంతో నగర వాసులు సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. - 8లో



**బకాయిలు చెల్లించకపోతే ఉద్యమం**
ఉద్యోగ పెన్షనర్లకు బకాయిలు చెల్లించకపోతే ఉద్యమానికి సిద్ధమవుతామని ఎస్టీయూ నేతలు హెచ్చరించారు. - 8లో

## న్యూస్‌రీల్

### నూతన ఏడాదిలో మొదటి గ్రీవెన్స్ రద్దు

**చిత్తూరు కలెక్టరేట్ :** నూతన ఏడాదిలో మొదటి గ్రీవెన్స్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)ను అధికారులు రద్దు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనకు వస్తున్నందున కలెక్టరేట్‌లో ఈ నెల 6వ తేదీన నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ప్రకటించారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం కాకపోవడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు నూతన సంవత్సరంలో మొదటి గ్రీవెన్స్‌ను రద్దు చేయడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

### సీఎం పర్యటనకు సర్వం సిద్ధం



కుప్పం చీగలపల్లెలో సీఎం పరిశీలించనున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రం

**కుప్పం:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం అధికారులు సర్వం సిద్ధం చేశారు. సీఎం సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ద్రావిడ విశ్వవిద్యాలయంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుని పర్యటనను ప్రారంభిస్తారు. రెండు రోజుల పాటు జరిగే అధికారుల సమీక్ష సమావేశం, వివిధ వర్గాలతో ప్రత్యేకంగా సమావేశాలు, శంకు స్థాపనలు వర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. దీంతో పాటు కుప్పం మండలం చీగలపల్లి వద్ద ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించనున్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే బహిరంగ సభ, కుప్పం అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. కంగుంది గ్రామంలో సీనియర్ టీడీపీ నేత పీఎస్ మునిరత్నం తండ్రి విగ్రహావిష్కరణ, అనంతరం మహిళలతో ముఖాముఖి కార్యక్రమాలకు సిద్ధం చేశారు. నడుమూరు వద్ద పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్ పథకాన్ని ప్రారంభించనున్నారు.

### గుడిమల్లంలో పురావస్తు శాఖ అధికారుల పరిశీలన

**రేణిగుంట(ఏర్పేడు):** ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని ఆదివారం పురావస్తు శాఖ అధికారులు పరిశీలించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపురాతన శైవక్షేత్రమైన ఈ ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ప్రతిపాదనలను సిద్ధం చేయనున్నట్లు పురావస్తుశాఖ సౌత్‌జోన్ రీజనల్ డైరెక్టర్ ఎన్‌కే పతాక్ తెలిపారు. ఆలయ ప్రతిష్ట, ప్రాశస్త్యం భక్తులకు మరింత చేరువయ్యే దిశగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు అడుగులు వేస్తున్నట్లు వివరించారు. ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఈఓ రామచంద్రారెడ్డి వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి శాలువాలతో సత్కరించారు. సూపరింటెండెంట్ గోపీనాథ్, సీఐ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నిరీక్షణ

రాయలసీమలోని క్షామపీడిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన గాలేరు–నగరి ప్రాజెక్టు 36 ఏళ్లుగా ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలింది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఎక్కువ శాతం పూర్తయిన పనులు తదనంతర పాలకుల నిర్లక్ష్యంతో ముందుకు సాగలేదు. నాడు కళకళలాడిన నీటి కాలువలు నేడు ముళ్లకంపలతో అడవిని తలపిస్తున్నాయి. 2019 నాటికి గాలేరు–నగరి ద్వారా నీరందిస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం దాన్ని విస్మరించింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 5,036 కోట్లు కేటాయించి, అవుకు వద్ద రెండు టన్నెళ్లు ప్రారంభించింది. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో రూ.2,254 కేటాయించినట్లు ప్రభుత్వం చూపినా ఇప్పటి వరకు ప్రాజెక్టు సందర్శన కూడా జరగలేదు. నిధులు కాగితాలకే పరిమితమైతే జిల్లాలోని తూర్పు ప్రాంతాలకు కల్పతరువుగా భావిస్తున్న ప్రాజెక్టు భవితవ్యం ప్రశ్నార్థకమే.

**గాలేరు–నగరి గమ్యం చేరేనా?**

- 36 ఏళ్లుగా నీటికి తప్పని నిరీక్షణ
- బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా కానరాని ఫలితం
- 2019కే గాలేరు నగరి పూర్తి చేస్తామన్న అప్పటి సీఎం చంద్రబాబు
- పడకేసిన ప్రాజెక్టుకు వైఎస్సార్‌సీపీ పాలనలో ఊపిరి
- అవుకు వద్ద రెండు టన్నెళ్లు ప్రారంభం
- ప్రస్తుతం బడ్జెట్‌లో రూ.2,254 కోట్లు కేటాయింపు
- నిధులు కేటాయించినా కనిపించని స్పందన



నీటితో నిండి ఉన్న అడవికొత్తూరు రిజర్వాయరు

**నగరి:** రేణిగుంట సమీపంలోని కరకంబాడి వద్ద గాలేరు–నగరి ప్రాజెక్టుకు 1988లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారు. కాలువ నిర్మాణానికి రూ.1,200 ఖర్చు అవుతుందని అంచనాలు రూపొందించారు. పనుల్లో వేగం లేక ఆగిపోయింది. ఉనికి కోల్పోయిన ఈ ప్రాజెక్టుకు 2004 జూన్ 4న మహానేత వైఎస్సార్ ఊపిరి పోసి మళ్లీ శంకుస్థాపన చేశారు. గాలేరు–నగరి ప్రాజెక్టుకు కొత్త అంచనాలు తయారు చేశారు. రూ.2,189 కోట్ల ప్రాథమిక అంచనాతో పనులు ప్రారంభమయ్యాయి. శ్రీశైలం మిగులు జలాలను పోతిరెడ్డిపాటు హెడ్ రెగ్యులేటర్ నుంచి గాలేరు– నగరి కాలువకు తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రాజెక్టులో భాగంగా పది రిజర్వాయర్లు నిర్మించదలిచారు. పనులు కూడా వేగంగా జరిగాయి. అయితే మహానేత మరణం ప్రాజెక్టు పాలిట శాపంగా మారింది. తదుపరి వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. 2019లో ప్రాజెక్టు పూర్తిచేసి నీరందిస్తామన్న టీడీపీ ప్రభుత్వం మాటతప్పింది. ప్రాంతాలు ముళ్లకంపలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది.

**ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రిజర్వాయర్ల వివరాలు**

| రిజర్వాయర్ | సామర్థ్యం | ఆయకట్టు |
|---|---|---|
| మల్లెమడుగు రిజర్వాయర్ | 2.650 టీఎంసీ | 55వేల ఎకరాలు |
| పద్మసాగర్ రిజర్వాయర్ | 0.45 టీఎంసీ | 5 వేల ఎకరాలు |
| శ్రీనివాస సాగర్ రిజర్వాయర్ | 0.448 టీఎంసీ | 4,200 ఎకరాలు |
| వేణుగోపాలసాగర్ రిజర్వాయర్ | 2.683 టీఎంసీ | 28,800 ఎకరాలు |
| వేపగుంట రిజర్వాయర్ | 0.533 టీఎంసీ | 5వేల ఎకరాలు |
| అడవికొత్తూరు రిజర్వాయర్ | 1 టీఎంసీ | 10 వేల ఎకరాలు |
| బాలాజీ రిజర్వాయర్ (3 టీఎంసీలు–ఇందులో 1 టీఎంసీ తాగునీరు) | | |



నీరు పాచిపట్టి ముళ్లకంపలతో నిండిన గాలేరు నగరి కాలువ



నీరు వృథాకాకుండా గ్రామస్తులు వేసిన కట్ట

**బడ్జెట్‌లో రూ.2,254 కోట్లు కేటాయింపు**

ప్రస్తుత ప్రభుత్వం బడ్జెట్‌లో గాలేరు నగరి ప్రాజెక్టుకు రూ.2,254 కోట్లు కేటాయించింది. అయితే ఇప్పటివరకు పర్యవేక్షణ చేపట్టలేదు. టెండర్లు పిలిచినా ఆ పనులు 12 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టు ఉన్న పరిస్థితుల్లో ఇది అసాధ్యమే. ఈ నిధులు కాగితాలకే పరిమితంకాక కార్యరూపం దాలిస్తే ప్రాజెక్టుకు చలనం వచ్చే అవకాశం ఉంది. లేకుంటే మళ్లీ ప్రాజెక్టు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంది.

**ఊపిరి పోసిన జగన్ ప్రభుత్వం**

చతికిలబడిన ప్రాజెక్టుకు గత జగన్ ప్రభుత్వం ఊపిరి పోసింది. 2020, ఆగస్టు 27న రూ.5,036 కోట్లు గాలేరు నగరి నుంచి హంద్రీ నీవాకు ఎత్తిపోతల పథకానికి మంజూరు చేసింది. 2023 నవంబరు 30న ఈ ప్రాజెక్టులో భాగంగా అవుకు వద్ద నిర్మించిన రెండు టన్నెళ్లను ప్రారంభించింది. దీంతో ఈ ప్రాజెక్టుపై ప్రజల్లో ఆశలు చిగురించాయి.



ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం

**నమూనాలో మార్పులు**

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కొండల తవ్వకాలు, అడవీ భూముల అనుమతులు అంటూ పలు సమస్యలు ఎదురవ్వడంతో నమూనాలో మార్పులు చోటుచేసుకున్నాయి. నిధులు సకాలంలో విడుదల కాకపోవడం, మరోవైపు కాలం దశాబ్దాలకు దశాబ్దాలు గడిచిపోతుండడం, చేపట్టిన పనులే మళ్లీ చేయాల్సి రావడం, డిజైన్ల మార్పు ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచేసింది.

**వృథా నీటికి అడ్డుకట్ట**

ఇటీవల కురిసిన వర్షాలకు గాలేరు నగరి రిజర్వాయర్ ప్రాంతం పూర్తిగా నీటితో నిండి ఉంది. ఇప్పటివరకు తవ్విన కాలువల్లోనూ నీరు నిండి ఉంది. ప్రాజెక్టు పనులు ఆశించిన మేరకు పూర్తికాకపోవడంతో నీరు వృథాగా పిల్ల కాలువల్లోకి వెళుతుంటే గ్రామస్తులు ఆ మార్గంలో కట్టవేసి నీటిని ఆపాల్సి వచ్చింది. ప్రాజెక్టు పూర్తయివుంటే దీనికి అనుసంధానంగా ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిండి ఉండేది. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజ్‌లో నీరు లేకపోవడంతో మున్సిపల్ అధికారులు రూ.లక్ష వ్యయంతో ఈ రిజర్వాయరు నుంచి మోటార్లు ఏర్పాటు చేసి నీటిని పంపింగ్ చేసుకోవాల్సి వస్తోంది.

**అడవిలా రిజర్వాయర్**



ఒకప్పుడు పనులు జరుగుతూ కళకళలాడిన రిజర్వాయరు ప్రాంతం ఇప్పుడు అడవిలా తయారైంది. 30 యేళ్లుగా ఎదురుచూస్తున్నా ఎప్పటికి అవుతుందో తెలియడం లేదు. ప్రాజెక్టు ప్రాంతంలో ఆవులు, గొర్రెలు మేపుకుంటున్నారు. కాలువల్లో ఉన్న నీరంతా పాచిపట్టి నిరుపయోగంగా ఉంది. ప్రాజెక్టు పూర్తయివుంటే ఈ ప్రాంతంలోని వ్యవసాయ భూముల విలువ కూడా పెరిగి ఉండేది.
– రామిరెడ్డి, రైతు, అడవికొత్తూరు

**నిరీక్షణ తప్పలేదు**



ప్రారంభ దశలో పనుల వేగం చూసి చాలా ఆనందపడ్డాం. కృష్ణాజలాలు నగరికి వస్తాయని ఇక తాగు, సాగునీటికి ఎలాంటి ఢోకా ఉండదని అనుకున్నాం. ఆ ఆశలు అడియాశలు అవుతూనే ఉన్నాయి. నేడు తాగడానికి స్వచ్ఛమైన నీరులేని పరిస్థితి. ప్రస్తుతం ఈ ప్రభుత్వం కేటాయించిన నిధులతో నైనా పనులు పూర్తవుతాయా? లేక అందని ద్రాక్షగానే మిగిలిపోతుందా అన్నది తెలియడం లేదు.
– బాబు, ప్రైవేటు ఉద్యోగి, నగరి

## భక్తులతో కిక్కిరిసిన బోయకొండ





బోయకొండలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు, ఆలయంలో భక్తుల రద్దీ

**చౌడేపల్లె:** జిల్లాలోని పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయంలో ఒక్కసారిగా భక్తుల రద్దీతో పెరగడంతో క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

## బాధితులకు అండగా దళిత సంఘాలు

- నిందితులకు రక్షణగా పోలీసులు



డీఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేస్తున్న వైస్ ఎంపీపీ

**నగరి:** మండలంలోని తడుకు దళితవాడలోని బాధిత దళితులకు పలు దళిత సంఘాలు అండగా నిలిచాయి. ఆదివారం సాయంత్రం ఆల్‌ఇండియా అంబేడ్కర్ అసోసియేషన్, బీఎస్పీ, బీపీఎఫ్, వీజీకే, నీలం పన్నాట్టుమయ్యం, బీపీఎఫ్, ఏపీఎల్ఎఫ్, అంబేడ్కర్ ఆర్మీ, న్యాయవాదుల సంఘం, తిరుపతి అంబేడ్కర్ భవన్ నేతలు, తిరుమల ఉద్యోగుల సంఘ నేతలు అంటూ మన రాష్ట్రంతో పాటు, తమిళనాడు నుంచి పలువురు తడుకు దళితవాడకు విచ్చేశారు. బాధితులను పరామర్శించారు. గొడవ జరిగిన విధానంపై ఆరాతీశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దళితులపై జరిగిన ఈ దాడిని ఖండిస్తున్నామన్నారు. దళితులపై దాడులు పెరుగుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని నిరసన తెలిపారు. దెబ్బలు తిన్న దళితులను రిమాండ్‌కు పంపి దాడి చేసిన వారికి రక్షణ కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకులస్తులను పరామర్శించిన ఎమ్మెల్యే, గాయపడిన దళితులను ఎందుకు పరామర్శించలేదన్నారు. దీనిపై అధికార పార్టీలో ఉన్న దళితులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. దళితులకు న్యాయం జరగాలంటే ఐక్య పోరాటం తప్పదన్నారు. మిగిలిన సంఘాలను ఏకం చేసుకొని న్యాయం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. అనంతరం దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత దళితుల తరపున వైఎస్ఎంపీపీ కన్నియప్ప డీఎస్పీ సాయినాథ్, సీఐ మహేశ్వర్‌కు మరోమారు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ భవన్ చైర్మన్ పరమశివం, తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగ సంఘ అధ్యక్షులు ప్రసాద్ రావు, అంబేడ్కర్ ఆర్మీ ఫౌండర్ ఈ గోపి, వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొకం రమేష్, నగరి నియోజకవర్గ కన్వీనర్ ఎం.బాబు, బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నాగూర్, ఎస్ఎస్‌డి చిరంజీవి, ఏపీఎల్ఎఫ్ నాయకుడు శేఖర్, నీలం పన్నాట్టుమయ్యం నాయకులు వైల్‌స్వామి, రంగరాజు, సెల్వం, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, న్యాయవాదుల సంఘం నాయకులు బాబు, నాగరాజు, ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీవారి దర్శనానికి 6 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 71,990 మంది స్వామివారిని దర్శించుకోగా 21,205 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.26 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.


## గీత.. రాత మరిచారా?

**తమ్ముళ్లూ మేం అధికారంలోకి వస్తే గీత కార్మికుల రాత మారుస్తాం.. కొత్త మద్యం పాలసీలో పది శాతం దుకాణాలు మీకు కేటాయిస్తాం..** ఇదీ నాడు ఎన్నికల్లో బాబు ఊరూరా ఇచ్చిన హామీ.. నేడు అధికారంలోకి వచ్చాక.. ఆ మాటే మరిచా రు. కొత్త మద్యం పాలసీ వచ్చింది. తెలుగు తమ్ముళ్లు పంచుకున్నారు.. ఆదాయం ఆర్జిస్తు న్నారు. అయితే గీత కార్మికులకు దుకాణాల కేటాయింపు మాత్రం అటకెక్కింది.

- కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలేవీ..?
- జిల్లాలో ఇప్పటికే 104 ప్రైవేటు మద్యం దుకాణాలు
- 10 శాతం దుకాణాలు గీత కార్మికులకేనంటూ హామీ
- దుకాణాలు ఎక్కడనే అంశంపై ఇంకా తేల్చని సర్కారు
- ప్రైవేటు మద్యంతో తమ్ముళ్ల గల్లాపెట్టెలు కళకళ!
- 'గీత' దాటనిస్తారా..? అంటూ కార్మికుల అనుమానాలు?



చిత్తూరు మండలంలో కొబ్బరి చెట్టుపై గీత కార్మికుడు



**వాళ్లు బాగుంటే చాలా..?**

మద్యం దుకాణాలను దక్కించుకున్నవారిలో 90 శాతం మంది టీడీపీకి చెందిన వాళ్లే. పైగా లైసెన్సులు తీసుకున్న వాళ్ల నుంచి ప్రతి నియోజకవర్గంలోని కూటమి పార్టీకి చెందిన ప్రధాన నాయకులకు వాటాలు తప్పనిసరిగా అందుతున్నాయి. దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు, వాటాలు తీసుకుంటున్న నాయకులు అందరూ బాగున్నారు.. కానీ కల్లుగీత కార్మికుల బాగోలు పట్టించుకునే దిక్కు లేదు.

**చిత్తూరు అర్బన్:** కూటమి నేతలు కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ అంశాన్ని గాలికి వదిలేశారు. అలాగని అసలు మద్యం దుకాణాలే పెట్టలేదా అంటే.. బ్రహ్మాండంగా కూటమి నేతలకు ఉపాధి చూపించి రూ.వందల కోట్లు ప్రభుత్వ ఖజానాకు వెళుతోంది. పాపం గీత కార్మికులే తమ రాత మారుతుందా..? లేదా ..? అని గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు.

**హామీ గుర్తుందా..?**

కూటమి నేతలు విడుదల చేసిన మ్యానిఫెస్టోను చూస్తే, అసలు ప్రజలకు ఇచ్చిన వరాలు ఎప్పుడు తీరుస్తారనే ప్రశ్న సామాన్యుడికి సైతం కలుగుతుంది. అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా కూటమి సర్కారు మ్యానిఫెస్టో కనిపిస్తుంది. ఇందులో కల్లుగీత కార్మికులను సైతం వదల్లేదు. తాము అధికారంలోకి వస్తే ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాల్లో 10 శాతం షాపులను కల్లుగీత కార్మికులకు రిజర్వు చేస్తామని హామీ గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రైవేటు మద్యం దుకాణాలు తెరిచేశారు. అక్టోబర్ 15వ తేదీన తెరిచిన మద్యం దుకాణాల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. దరఖాస్తుల విక్రయాలు, నాన్ రీ–ఫండబుల్ డిపాజిట్లు, త్రైమాసిక లైసెన్సు ఫీజుల రూపంలో రూ.110 కోట్లు, ఇప్పటి వరకు అమ్ముడైన మద్యం ద్వారా రూ.120 కోట్లు.. వెరసి మొత్తంగా దాదాపు రూ.230 కోట్ల వరకు సంపాదన ఆర్జించింది. మొన్నటికి మొన్న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు నగరాల్లో ప్రీమియం మద్యం అవుట్‌లెట్ల కోసం నోటిఫికేషన్ కూడా ఇచ్చిన ప్రభుత్వానికి కల్లుగీత కార్మికులకు దుకాణాలు ఇస్తామన్న హామీ మాత్రం గుర్తుకు రాలేదు.

**ఆలోచన ఉందా..**

జిల్లాలో 104 మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్సులను మంజూరు చేసింది. మ్యానిఫెస్టో ప్రకారం గీత కార్మికులకు 10 శాతం దుకాణాలు ఇవ్వాలి. అంటే ఆ లెక్కన జిల్లాలోని కల్లుగీత కార్మికులకు 14 దుకాణాలు కేటాయించాలి. ప్రైవేటు దుకాణాల కేటాయింపునకు తీసుకున్నట్లు ఒక్కో దరఖాస్తు కోసం రూ.2 లక్షలు నాన్–రీఫండబుల్ తీసుకుంటారా..? లైసెన్సు ఫీజు రూ.55 లక్షలు నుంచి రూ.65 లక్షల మధ్యలో ఉంచుతారా..? ఏమైనా తగ్గిస్తారా..? అనే ప్రశ్నలకు ఇప్పటి వరకు ఎవరి వద్దా ఎలాంటి సమాధానాలు లేవు. ప్రైవేటు మద్యం దుకాణాలకు ఇచ్చిన రెండేళ్ల లైసెన్సు కాలపరిమితిలో ఇప్పటికే మూడు నెలలు కావస్తోంది. అంటే గీత కార్మికులు ఈ మూడు నెలల ఆదాయం కోల్పోయినట్లే అవుతుంది. అసలు నోటిఫికేషన్ ఎప్పుడిస్తారు..? ఇస్తే కనుక క్షేత్రస్థాయిలో నిజమైన గీత కార్మికులకు దుకాణాలు ఇస్తారా..? లేదా ఆ ముసుగులో ఉన్న టీడీపీ కార్యకర్తలకు దుకాణాలు అప్పజెబుతారా? అన్న అంశం అర్థం కావడంలేదని పలువురు గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఎన్ఎస్ఎఫ్ చాంపియన్ షిప్ పోటీలు



పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

- పోటీల్లో పాల్గొన్న 600 మందికి పైగా ఆంధ్ర, తెలంగాణ క్రీడాకారులు

**నాయుడుపేటటౌన్:** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్)వారి సారథ్యంలో ఆదివారం సాయంత్రం వరకు 7వ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన సుమారు 600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు, జాతీయ పారా అథ్లెటిక్ మోమిడి లక్ష్మయ్య, కమిటీ సభ్యుల సారథ్యంలో 6, 8, 10, 12, 14 ఏళ్ల పిల్లలకు 60, 80, 100, 200, 400, 600 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ముందుగా ఈ పోటీలను జుడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూరయ్య, బట్టా సుబ్రహ్మణ్యం యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్ కుమార్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఐదు వరుస విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లు, స్పోర్ట్ టీషర్టులను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ మునిరత్నం, ఆర్యవైశ్య సంఘ తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షుడు గూడూరు కిషోర్ కుమార్, ఎన్ఎస్ఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ఎంఈఓ

## పబ్లిసిటీకి.. ప్రహరీగోడలు



గోడలపై ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతూ వేసిన పెయింటింగ్

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరులో కూటమి నేతల పబ్లిసిటీ పిచ్చి ముదిరింది. ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు పెడుతున్నారు. దీనికితోడు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని ప్రభుత్వ భవనాలు, పాఠశాల భవనాలు, కార్యాలయ ప్రహరీ గోడలపై శుభాకాంక్షలు తెలుపుతూ పెయింటింగ్ వేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. అధికారులు ఇలాంటివి పట్టించుకోరా? అంటూ విమర్శలు చేస్తున్నారు.

## వైఎస్సార్ విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం

గుడుపల్లె: మండలంలోని ఓయన్ కొత్తూరు గ్రామం రోడ్డు కూడలిలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయాన్నే వైఎస్సార్‌సీపీ నాయకులు విగ్రహం ధ్వంసం చేసి ఉండడం గుర్తించారు. గతంలో కూడా ఇలాగే ధ్వంసం చేయడంతో రెండో సారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచ్ దేవప్పనాయుడు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతురు మృతి



మృతి చెందిన అంకయ్య (ఫైల్)

విజయపురం : తమిళనాడు కనకమ్మసత్రం రఘునాథపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతురు మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. బాధితుల వివరాల మేరకు, మండలంలోని పాతర్కాడు ఆదిఆంధ్రవాడకు చెందిన అంకయ్య (27), భార్య రమ్య, చిన్న కుమార్తెలు, పూర్ణిమ, మోక్షిత (4) శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై కనకమ్మసత్రం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రఘునాథపురం వద్ద ఎదురుగా ఈచర్‌వాహనం ఢీ కొంది. అంకయ్య, చిన్న కుమార్తె మోక్షిత తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చెన్నై జీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మోక్షిత చనిపోగా, అంకయ్య చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య రమ్య, కుమార్తె పూర్ణిమ స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.



# వామ్మో.. చైనా వెల్లుల్లి!




- చాపకింద నీరులా పాకుతున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో జోరందుకున్న అమ్మకాలు
- చౌకగా ఉండడంతో వీటిని కొంటున్న జనం
- వీటిపై 2014లోనే నిషేధం విధించిన కేంద్ర ప్రభుత్వం

**కొత్త రోగాలతోపాటు, ప్రమాదకరమైన వ్యవసాయ ఉత్పత్తులు చైనా నుంచి భారత్‌లోకి దిగుమతి అయిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిన చైనా వెల్లుల్లి జిల్లాలోని మార్కెట్‌ను ముంచెత్తేసింది. చైనా 'చీప్' ట్రిక్స్ ఇక్కడ కూడా అమలు చేసింది. కిలోకు వంద రూపాయలు తగ్గించడంతో జనం ఎగబడి కొనేస్తున్నారు. దీంతో ఇది క్రమంగా సూపర్‌మార్కెట్లలో కూడా విపరీతంగా అమ్ముడుపోతోంది. అయితే దీని వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ పరిస్థితి చూస్తే చైనాలో ఉన్న రోగాలను ఇలాంటి వ్యవసాయ ఉత్పత్తులతో కలిపి భారత్‌కు పంపించేస్తోంది. ఇది బయోవార్‌కు సంకేతమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**

పలమనేరు: కరోనా వైరస్ జనాన్ని ముప్పుతిప్పలు పెట్టిన విషయం మరవకముందే మళ్లీ చైనాలో ఉన్ప్లూయెంజా ఏ హెచ్ఎంపీవీ అనే మిస్టరీ వైరస్ ప్రపంచాన్ని భయపెడుతోంది. ఈ నేపథ్యంలో భారత్‌లో పాగా వేయాలని పథకం పన్నిన చైనా ఇప్పుడు మన దేశవాళీ వెల్లుల్లి రకానికి పోటీగా చైనా (గార్లిక్) వెల్లుల్లిని దేశంలోకి దింపేసింది. చైనా హైబ్రిడ్ గార్లిక్‌గా పిలిచే ఈ తెల్లగడ్డ ఇది మెల్లగా రాష్ట్రాలను దాటి ఇప్పుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో హల్‌చల్ చేస్తోంది. మానవాళికి ముప్పుగా మారిన చైనా వెల్లుల్లిని కేంద్ర ప్రభుత్వం 2014లో బ్యాన్ చేసినా ఇవి ఎలా వస్తున్నాయనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. జన్యుమార్పిడితో పెంచిన వీటి కారణంగా మానవాళికి ముప్పు తప్పదని ఇప్పటికే ఆరోగ్యశాఖ ప్రకటించింది. కానీ ఇవి చౌకగా లభిస్తున్నందున జనం వీటిని కొనుగోలు చేస్తున్నారు.

### తక్కువ ధరతో విక్రయం

ప్రస్తుతం వెల్లుల్లి ధర కిలో రూ.500 ఉంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు చైనా నుంచి రహస్యంగా అక్కడి జీన్ మోడిఫైడ్ రకమైన వెల్లుల్లిని ఇక్కడికి పంపుతున్నారు. చిత్తూరు, కర్నూలు, హైదరాబాదు, కర్ణాటకలోని చింతామణి, బెంగళూరు మార్కెట్లనుంచి ఎక్కువగా చైనా వెల్లుల్లి జిల్లాలోకి చేరుతోంది. వీటి ధరలు మన వెల్లుల్లి కంటే కిలోకు రూ.వంద తక్కువగా ఉండడంతో జనం వీటిని ఎక్కువగా కొంటున్నారు.

### పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు

నిషేధిత చైనా వెల్లుల్లి ఇక్కడి మార్కెట్లను ముంచెత్తుతోంది. కానీ వీటిని జిల్లాకు చెందిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. బ్యాన్ ఉన్నప్పటికీ ఇవి ఎక్కడినుంచి జిల్లాకు చేరుతున్నాయనే సమాచారం కూడా వీరికి తెలియకపోవడం కొసమెరుపు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హానికరమైన చైనా వెల్లుల్లి అమ్మకాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### కేంద్ర ప్రభుత్వ నిషేధం

చైనా వెల్లుల్లి కారణంగా ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని పసిగట్టిన కేంద్ర ప్రభుత్వం 2014లోనే వీటిని దేశంలో నిషేధం విధించింది. ఆ మేరకు వీటి అమ్మకాలు ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువ కావడంతో ఆ రాష్ట్రానికి చెందిన మోతీలాల్ యాదవ్ అనే న్యాయవాది దీనిపై అలహాబాదు హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి దేశంలో వీటిని అమ్మరాదంటూ నిషేధాన్ని అమలు చేయాలని కేంద్రానికి సూచించింది. దీంతో 2014నుంచి దేశంలో చైనా గార్లిక్ అమ్మకాలపై నిషేధం కొనసాగుతోంది.

### ఆకర్షణీయంగా ఉన్నా ఆరోగ్యానికే దెబ్బ

చైనా వెల్లుల్లి గడ్డలు చూసేందుకు చాలా నాణ్యంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. మన దేశవాళి రకాల కన్నా ఇవి తక్కువ ధరకు లభ్యమవుతున్నందున వీటిని జనం కూడా ఎక్కువగా కొంటున్నారు. వ్యాపారులకు సైతం ఇవి లాభసాటిగా మారాయి. అయితే వీటి జన్యువులను మార్చి రూపొందించిన రకం కావడంతో ఇందులోని ఫంగస్ కారణంగా ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### ఇక్కడికి ఎలా వస్తోంది?


మానవాళికి ప్రమాదకరంగా మారిన చైనా వెల్లుల్లిని కేంద్రం బ్యాన్ చేసింది. కానీ మన దేశంలోని పలు మార్కెట్లతోపాటు ఆఖరుకు మన జిల్లాలోకి సైతం ఈ సరుకు ఎలా వస్తోంది? దీన్ని అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. దీనికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యం కాదా? ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నాగరాజు, పలమనేరు

### ఇవి డీమోడిఫైడ్ జీన్స్ ఉత్పత్తులు


చైనాలో ఎక్కువ ఉత్పత్తి కోసం డీమోడిఫైడ్ (జన్యుమారిడి) రకాల పండ్లు, కూరగాయలను ఇప్పటికే ఉత్పత్తి చేసి ప్రపంచంలోని పలు దేశాలకు పంపుతోంది. ఇలాంటి వాటిని తినడం కారణంగా మనుషుల్లో జన్యు పరమైన ఇబ్బందులు, తద్వారా అనారోగ్య సమస్యలు తప్పవు. అందుకే మనం దేశవాళి రకాలను మాత్రమే పండించి వాటిని తినడం మేలు.

- డా.మల్లికార్జున రెడ్డి, వైద్యాధికారి, పలమనేరు

## అదుపుతప్పి బోల్తాపడిన కారు



తవణంపల్లె: మండలంలోని నర్తపుచేను దగ్గర తిరుపతి–బెంగళూరు హైవేపై ఆదివారం అదుపు తప్పి బోల్తా పడింది. తిరుపతికి చెందిన గిరిబాబు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. గిరిబాబు తిరుపతి నుంచి కారులో బెంగళూరుకు బయల్దేరాడు. నర్తపుచేను దగ్గర హైవేలో పాడి ఆవు అడ్డంగా రావడంతో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ప్రమాదం జరిగిన సమయంలో హైవేలో వాహనాలు రాకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కారు నడిపిన గిరిబాబు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

## సీసీ కెమెరాకు చిక్కిన దొంగ


హుండీ పగలగొడుతున్న దొంగ (సీసీ పుటేజి చిత్రం)

నగరి : గ్రామ దేవత ఓరుగుంటాలమ్మ ఆలయం తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడిన వ్యక్తి సీసీ కెమెరాకు చిక్కాడు. సుమారు 50 ఏళ్ల ఉన్న ఈయన మంకీ క్యాప్, చేతికి గ్లౌజ్ ధరించి ఒక ఇనుపరాడ్‌తో ఆలయంలోకి చొరబడ్డారు. ఆ రాడ్ సాయంతోనే హుండీకి ఉన్న మూడు తాళాలు, ఆలయానికి, గర్భాలయానికి ఉన్న తాళాలు పగలగొట్టి దర్జాగా దోచుకెళ్లాడు. సుమారు గంటకుపైగా ఆలయంలోనే ఇటు అటూ తిరుగుతూ దొంగిలించుకెళ్లాడు. ఈ సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బకాయిలు చెల్లించకపోతే ఉద్యమం



ఉద్యోగ, ఉపాధ్యాయ డిమాండ్లను పరిష్కరించాలని ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్టీయూ నాయకులు

కార్వేటినగరం: ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలు సంక్రాంతిలోపు చెల్లించక పోతే ఉద్యమానికి సిద్ధమవుతామని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక హిందూ–ముస్లిం కల్యాణమండపంలో ఆదివారం ఆ సంఘం 78వ జిల్లా కౌన్సెలింగ్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ నెలసరి జీతాల నుంచి పొదుపు చేసుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐకు సంబంధించి రుణాలు, తుది చెల్లింపులు, సంపాదిత సెలవులు నగదు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు గంటామోహన్ మాట్లాడుతూ 2023 జూలై నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ వేతన సవరణ అమలు చేయాల్సి ఉందన్నారు. పీఆర్సీ అమలులో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని చెప్పారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం చట్టం చేస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. హై స్కూల్ ప్లస్‌ను, జూనియర్ కళాశాలలుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు.

### నిరుపయోగంగా హెల్త్ కార్డులు

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మధన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, వైద్య చికిత్సలు పొందడంలో నిరుపయోగంగా ఉందన్నారు. చిత్తూరు జిల్లా సరిహద్దులో ఉన్న బెంగళూరు, చెన్నై, వేలూరు కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డుల ద్వారా వైద్యం పొందడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టీయూ యువనాయకుడు పవన్ కుమార్ అకాల మృతి సంఘానికి తీరని లోటని పలువురు అన్నారు. ఈ క్రమంలో భాగంగా పవన్‌కుమార్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేణుగోపాలస్వామి ఆర్చి నుంచి హిందూ–ముస్లిం కల్యాణ మండపం వరకు ఎస్టీయూ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, ఆర్థిక కార్యదర్శి యువరాజు, మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, రాష్ట్ర నాయకులు మునెప్ప, పురుషోత్తం, ఇలియాస్, జగన్మోహనెడ్డి లోకనాథరెడ్డి, జనార్దన్‌రెడ్డి, దేవరాజులు, సర్దార్, ఆటుకారు చంద్రశేఖర్, న్యాంతుల్లా, నాగేంద్ర, అమరనాథ్, వేణు, నరేష్, టీఎం సుబ్రమణ్యం, దేవయ్య, గురవయ్య, కార్తికేయులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని యువకుడి మృతి


మృతి చెందిన యువకుడు


కుప్పం: బెంగళూరు–చెన్నై రైల్వే మార్గమధ్యంలోని కుప్పం రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. గుల్లేపల్లె వద్ద రైల్వే పట్టాలపై పడి ఉన్న యువకుడి మృతదేహాన్ని ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించి రైల్వే పోలీసు అధికారులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు పంచనామా నిమిత్తం కుప్పం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడు 35 ఏళ్ల వయసు ఉండి చామనచాయ రంగుతో గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి దుర్మరణం

బైరెడ్డిపల్లె : మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం (55) ఆదివారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. సుబ్రమణ్యం తన పొలం వద్ద ఉన్న షెడ్డులోనే ప్రతి రోజూ నిద్రపోయేవాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో షెడ్డులో ఉన్న 4 పొట్టేళ్లతో పాటు సుబ్రమణ్యం మృతి చెందాడు. ఆదివారం ఉదయం సమీపంలోని రైతులు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. సుబ్రమణ్యంకి రెండేళ్ల క్రితమే భార్య, కుమారుడు మృతి చెందారు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని చెప్పారు.

# ఆధార్‌తోనే స్టాంప్ పేపర్ విక్రయం

- కొత్త నిబంధనలతో వెండర్లకు అవస్థలు
- వినియోగదారుల ఓటీపీతోనే పేపర్ల లభ్యం




చిత్తూరు కార్పొరేషన్: అమ్మపెట్టదు..అడుక్కోనివ్వదు అన్న చందంగా మారింది ప్రభుత్వ తీరు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంప్ పేపర్స్ కొరత ఓ వైపు వేధిస్తోంది. పోనీలే విక్రేతల (వెండర్ల) వద్ద నుంచి పేపర్స్ కొందామంటే అది కష్టతరంగా మారింది. కొత్త నిబంధనలతో వెండార్ల నియంత్రణకు తెరతీసింది. గతంలో మాన్యువల్‌గా స్టాంప్ పేపర్లను వెండర్లు అమ్మేవారు. ప్రస్తుతం ఆధార్‌కార్డు, వినియోగదారుడి ఫోన్ నంబర్ ఇచ్చి ఓటీపీ చెబితేనే స్టాంప్ పేపర్ ఇచ్చే విధంగా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఈ విధానంలో మార్పులు తీసుకొచ్చింది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదని వెండర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని స్టాంప్ వెండర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం వీరితోపాటు ప్రజలకు కూడా కష్టాలు తెచ్చిపెడుతోంది. గతంలో స్టాంప్ పేపర్ కావాలంటే నేరుగా వెండర్ వద్దకు వెళ్లి తీసుకోవచ్చు. లేనిపక్షంలో కొనుగోలుదారుడి బదులు ఎవరైనా వెళ్లి తీసుకుని రావచ్చు. ప్రస్తుతం స్టాంప్ పేపర్ కావాల్సిన వారే నేరుగా వెళ్లాలి. తమ ఆధార్ కార్డు నెంబరు ఇచ్చి వారి ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ చెప్పాలి. అప్పుడు కంప్యూటర్లో నమోదు చేసి స్టాంప్ ప్రింట్ తీసి ఇస్తారు. స్టాంపు పేపర్ కోసం కనీసం 15 నిమిషాలకుపైనే వేచిచూసి తీసుకోవాలి.

### పెరగనున్న ఖర్చు

ప్రతి స్టాంపు వెండర్ ఒక దుకాణంతోపాటు కంప్యూటర్, ప్రింటర్, ఇంటర్‌నెట్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలి. ఈ వృత్తిలో పలువురు పెద్దవారు ఉన్నారు. అరకొర ఆదాయంతో ఇంత సెటప్ ఏర్పాటు చేసుకోవడం కష్టతరంగా మారింది. చాలామందికి కంప్యూటర్ పరిజ్ఞానం లేదు. పైగా స్టాంపుల విక్రయం అరకొరగానే ఉంటోంది. ఆన్‌లైన్ సమస్య వస్తే ఆ సమయంలో స్టాంప్ పేపర్స్ ఇవ్వడానికి కుదరదు. ఒక్కొక్కసారి రెండు రోజులు కూడా సైట్ పనిచేయని సందర్భాలు ఉన్నాయి. వసతులు లేనివారందరూ కంప్యూటర్, ప్రింటర్ కోసం పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. గడిచిన నెల రోజుల నుంచి కనీసం తీసుకున్న సాక్ట్‌లో 5 శాతం కూడా స్టాంప్ వెండర్లు విక్రయించలేదు. కొత్త విధానం అములో రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల పాత్రే కీలకం.


స్టాంప్ పేపర్

### బతికేది ఎలా?


కొత్త విధానంతో బతికేది ఎలా అనిపిస్తోంది. ఎప్పటి నుంచో ఈ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. గతంలో పుస్తకంలో నమోదు చేసుకొని పేపర్స్ ఇచ్చేవాళ్లం. సీనియర్ వెండర్లలో చాలా మందికి కంప్యూటర్ పరిజ్ఞానం లేదు. ఆన్‌లైన్ విధానం కోసం గదిని అద్దెకు తీసుకొని కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాలి. టెక్నికల్‌గా ఆపరేటర్‌ను నియమించుకొని ఇంటర్‌నెట్ కనెక్షన్ తీసుకోవాలి. నెట్‌వర్క్ రాకపోతే రోజంతా సమయం వృథా. ఇదంతా ఖర్చుతో కూడుకున్న పని. రోజుకు రూ.500 కూడా ఆదాయం రాని వెండర్లకు ఇది మరింత భారం.

- చంద్రశేఖర్, స్టాంప్ వెండర్, చిత్తూరు

కనీసం జిల్లా రిజిస్ట్రార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు, స్టాంపు వెండార్లకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. వెండార్ స్టాంపులు విక్రయించాలంటే ముందుగా కంప్యూటర్ లాగిన్ అవ్వాలి. దీనికి ఒక ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేయాలి. 15 నిమిషాల్లో దాన్ని నమోదుచేయకపోతే మళ్లీ మొదటి నుంచి చేయాల్సి ఉంటుంది. పాత తేదీల్లో స్టాంపులు విక్రయించకుండా ఈ విధానం తెచ్చామని ఉన్నతాధికారులు అంటున్నారు. తమను సాగనంపేందుకే ఇలా చేస్తున్నారని వెండార్లు వాపోతున్నారు. ఇప్పటికే అధికారులకు తమ సమస్యలను వివరించామంటున్నారు.